
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



పెద్దపల్లి

జిల్లా వార్తలు

5★

ఆదివారం 14 జూలై 2024

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

ఓదెల, జూలై 13: రైతులకు రుణమాఫీ చేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించడంపై మండలంలోని శానగొండలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మూల ప్రేమ్‌సాగర్ రెడ్డి ఆధ్వర్యంలో సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం శనివారం నిర్వహించారు. అలాగే మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు చిత్రపటాలకు క్షీరాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ ఆళ్ల సుమన్‌రెడ్డి, మాజీ సర్పంచులు అంకం రమేష్, జక్కుల వెంకటస్వామి, అలాగే సింగిల్ విండో డైరెక్టర్ బొంగోని శ్రీనివాస్‌గౌడ్, యువజనవిభాగం జిల్లా నాయకుడు రాహుల్ పాల్గొన్నారు.

ఆవిష్కరణలకు ప్రోత్సాహం



యాక్సిల్ కెమెరా ఫర్ స్కూల్ బస్ వివరాలను రాష్ట్రపతి ముర్ముకు వివరిస్తున్న అల్ఫోర్స్ విద్యార్థి పూజశ్రీ (ఫైల్)

- విద్యార్థుల్లోని నూతన ఆలోచనలకు అవార్డులు
- జిల్లా నుంచి జాతీయ స్థాయికి ముగ్గురి ఎంపిక
- ఇన్‌స్పైర్ అవార్డుల కోసం దరఖాస్తుల ఆహ్వానం
- సెప్టెంబరు 15 వరకు గడువు

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

విద్యార్థుల్లో నూతన ఆలోచనలు, సృజనాత్మకత, శాస్త్రీయ దృక్పథం, పోటీతత్వం పెంపొందించాలన్న లక్ష్యంతో ప్రతి ఏటా కేంద్ర ప్రభుత్వం సైన్స్ అండ్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఇన్‌స్పైర్ ప్రదర్శనల ఎంపిక కోసం ఈ ఏడాది కూడా దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది. సైన్స్‌పై విద్యార్థులను ప్రోత్సహించేందుకు గాను 2009-10 సంవత్సరం నుంచి ఇన్‌స్పైర్ అవార్డులను అప్పటి ప్రభుత్వం ప్రవేశ పెట్టింది. అప్పటి నుంచి ప్రతి ఏటా ఈ అవార్డుల కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఇన్‌స్పైర్ (ఇన్నోవేషన్ ఇన్ సైన్స్ పర్స్యూట్ ఫర్ ఇన్‌స్పైర్డ్ రిసెర్చ్) అవార్డులు (2024-25) కోసం నిర్వహించే అవార్డుల ఎంపిక కోసం ప్రభుత్వం సెప్టెంబరు 15వ తేదీ వరకు దరఖాస్తు చేసుకునేందుకు గడువు విధించింది. ఈ అవార్డుల కోసం ప్రభుత్వ, ప్రైవేటు హైస్కూళ్లు, యూపీఎస్‌ల నుంచి దరఖాస్తులు సమర్పించాల్సి ఉంటుంది. ఇన్‌స్పైర్ అవార్డుల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఇందుకు పాఠశాలల హెచ్‌ఎంలు, గైడ్ టీచర్లు విద్యార్థులకు తోడ్పాటు అందించాల్సి ఉంటుంది.

ఒక్కో పాఠశాల నుంచి ఐదు ప్రాజెక్టులు..

ఇన్‌స్పైర్ అవార్డుల కోసం ఒక్కో స్కూల్ నుంచి గరిష్టంగా 5 ప్రాజెక్టులను పంపించాల్సి ఉంటుంది. హైస్కూల్‌లో 6వ తరగతి నుంచి 10వ తరగతి చదువుతున్న విద్యార్థులు, ప్రాథమి కోన్నత పాఠశాలలో 6,7 తరగతులు చదువుతున్న విద్యార్థులు దరఖాస్తు చేసు కునేందుకు అర్హులు. ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, గైడ్ టీచర్లు ఐదుగురి విద్యార్థుల ప్రాజెక్టులను ఎంపిక చేసి వారి పేరిట ఆన్‌లైన్ వెబ్‌సైట్‌లో దరఖాస్తులు సమర్పించాల్సి ఉంటుంది.

సాంఘిక సంక్షేమ, కేజీబీవీ, మోడల్ స్కూళ్లు, ట్రైబల్ వెల్ఫేర్, ప్రభుత్వ హైస్కూళ్లు, యూపీఎస్‌లు ఎయిడెడ్, ప్రైవేటు స్కూళ్లు కూడా తప్పక దరఖాస్తు చేయాల్సి ఉంటుంది. దీని కోసం విద్యార్థుల పాస్ పోర్టు ఫొటోలు, బ్యాంక్ అకౌంట్ నంబర్, ఐఎఫ్ఎస్సీ కోడ్, బ్రాంచి పేరు, విద్యార్థి పేరు, తండ్రి పేరు, ఆధార్ నంబర్, పుట్టిన తేదీ, కులం, ప్రాజెక్టు పేరు వివరాలు అవసరం. అలాగే చేపట్ట బోయే ప్రాజెక్టు పేరు స్వచ్ఛభారత్, స్వస్థ్ భారత్, మేక్ ఇన్ ఇండియా, డిజిటల్ ఇండియా, స్కిల్ ఇండియా వంటి ప్రాజెక్టులపై 100 పదాలతో కూడిన పీడీఎఫ్ ఫైల్, గైడ్ టీచర్ పేరు. హెచ్‌ఎం పేరు అప్‌లోడ్ చేయాలి.

ఇన్‌స్పైర్ అవార్డుల ఎంపిక కోసం జిల్లాలోని అన్ని స్కూళ్లు తప్పక దరఖాస్తు చేయాలని సంబంధిత అధికారులు కోరుతున్నారు. దరఖాస్తులు ఆన్‌లైన్‌లో పూర్తి చేయడానికి గడువు తేదీ సెప్టెంబరు 15 అని తెలిపారు. దరఖాస్తు చేయకపోతే విద్యార్థులు జిల్లా స్థాయి ఇన్‌స్పైర్ విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలో పాల్గొనే అవకాశాన్ని కోల్పోతారని, ఈ విషయంలో ఉపాధ్యాయులు, హెచ్‌ఎంలు శ్రద్ధ చూపాలన్నారు.

మొబైల్ యాప్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు..

ఈసారి వెబ్‌సైట్‌లోనే గాకుండా మొబైల్ యాప్ ద్వారా కూడా ఇన్‌స్పైర్ అవార్డుల కోసం దరఖాస్తులు సమర్పించే అవకాశం కల్పించారు. దీని కోసం ప్లే స్టోర్ నుంచి 'ఇన్‌స్పైర్ మనక్' అనే యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలి. కంప్యూటర్ లేకపోతే మొబైల్ యాప్ ద్వారా సులభంగా దరఖాస్తులు పంపవచ్చు. అయితే దరఖాస్తులు అప్‌లోడ్ చేసే ముందు విద్యార్థుల పేర్లు బ్యాంక్ పాస్ బుక్కులో ఎలా ఉంటే కచ్చితంగా అలాగే నింపాలి. లేకపోతే అవార్డు డబ్బులు విద్యార్థుల అకౌంట్లో జమ కావడం సాధ్యం కాదు. అలాగే జాయింట్ అకౌంట్ అయితే విద్యార్థి పేరు ముందు ఉండేలా చూసుకోవాలి. లేకపోతే డబ్బులు క్రెడిట్ కావు. అలాగే అకౌంటుకు ఆధార్ లింక్ అయిందా లేదా చూసుకోవాలి.

పాఠశాల దశలోనే నూతన ఆలోచనలకు ఇన్‌స్పైర్..

ఇన్‌స్పైర్ సైన్స్ అవార్డుల కోసం దరఖాస్తు చేయడం ఎందుకంటే స్కూళ్లలో సైన్స్ బోధించడం ద్వారా కాకుండా ప్రయోగాలు చేయడం ద్వారా నేర్చుకోవాలన్న విషయం ఆధారంగా ప్రపంచ దేశాలన్నీ ప్రయోగాత్మకంగా అభ్యసన విధానాలు రూపొందించుకున్నాయి. పాఠశాల దశలోనే విద్యార్థుల్లో నూతన ఆలోచనలు, సృజనాత్మకత, నూతన ఆవిష్కరణలు, సైన్స్‌పై ఆసక్తి పెంపొందించాలన్న లక్ష్యంతో ఏటా ఇన్‌స్పైర్ అవార్డులు అందిస్తున్నారు. ఇన్‌స్పైర్ కింద జిల్లా స్థాయిలో ఎంపికైన విద్యార్థి అకౌంట్లో 10 వేల రూపాయలు సైన్స్ ప్రాజెక్టులు, ప్రయోగాల కోసం అందిస్తారు. ఈ మొత్తంతో ఎంపికైన విద్యార్థులు ప్రాజెక్టుల తయారీకి, రవాణా, ఇతర ఖర్చులకు వినియోగించుకోవాల్సి ఉంటుంది. జిల్లాలోని వివిధ పాఠ శాలల నుంచి వచ్చిన ప్రాజెక్టుల్లో 10 శాతం ఎంపిక చేసి, రాష్ట్ర స్థాయికి పంపిస్తారు. అక్కడికి వచ్చిన ప్రాజెక్టుల్లో 10 శాతం అవార్డులను జాతీయ స్థాయికి పంపిస్తారు. జాతీయ స్థాయిలో 60 ప్రాజెక్టులను ఎంపిక చేసి ఒక్కో విద్యార్థి అకౌంట్‌లో 25 వేల రూపాయలు జమ చేస్తారు. ఈ అవార్డులను విద్యార్థులు రాష్ట్రపతి భవన్‌లో ప్రదర్శించాల్సి ఉంటుంది. ఆ తర్వాత జపాన్ సకురాలో జరిగే ప్రదర్శనకు కూడా తీసుక వెళ్లనున్నారు.

విద్యార్థులను ప్రోత్సహించాలి..

రవి నందన్, జిల్లా సైన్స్ అధికారి

ఇన్‌స్పైర్ అవార్డుల పట్ల విద్యార్థులను పాఠశాలల ప్రధానోపాధ్యా యులు, ఉపాధ్యాయులు ప్రోత్స హించాలి. వారిలో ఉన్న శాస్త్రీయ దృక్పథాన్ని, సృజనాత్మకతను వెలికి తీయాలి. సమాజహితమైన ఆవిష్క రణలపై విద్యార్థులను తీర్చిదిద్దాలి. ఈ విద్యా సంవత్స రానికిగాను వచ్చే నెల 15వ తేదీ వరకు దరఖాస్తు చేసుకునేందుకు గడువు విధించారు. జిల్లా నుంచి ముగ్గురు విద్యార్థులు జాతీయ స్థాయికి ఎంపికై వారు రూపొందించిన ప్రాజెక్టులను ప్రదర్శించారు. ఆ స్థాయికి జిల్లాలో రూపొందించిన మరిన్ని ప్రాజెక్టులు ఎంపిక కావాలని ఆశిస్తున్నాం.

జిల్లా నుంచి జాతీయ స్థాయి ఎంపికైన విద్యార్థులు..

2022-23లో విద్యా సంవత్సరంలో జిల్లాకు చెందిన ఇద్దరు విద్యార్థులు ప్రదర్శించిన అవార్డులు జాతీయ స్థాయికి ఎంపికయ్యాయి. రామగిరి మండలం చందనా పూర్ జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన దాసరి హర్షిత రూపొందించిన బహుళ ప్రయోజనకర హెల్మెట్ ప్రాజెక్టు, సుల్తానాబాద్ అల్ఫోర్స్ హైస్కూల్‌కు చెందిన ముస్త్యాల పూజశ్రీ రూపొందించిన 'ఆక్సిల్ కెమెరా ఫర్ స్కూల్ బసెస్' ప్రాజెక్టు జాతీయ స్థాయికి ఎంపిక కావడంతో గత ఏడాది ఏప్రిల్ 10 నుంచి 15 వరకు రాష్ట్రపతి భవన్‌లో జరిగిన ఇన్‌స్పైర్ ప్రదర్శనల్లో తమ ప్రాజెక్టులను ప్రదర్శించారు. నవంబరులో దాసరి హర్షిత, ఈ ఏడాది మే నెలలో పూజశ్రీ జపాన్‌లోని సకురాకు వెళ్లి వచ్చారు. 2021-22లో గోదావరిఖనిలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌కు చెందిన కామెర శ్రీజ రూపొందించిన బ్లయిండ్ క్యాప్, స్టిక్ ప్రాజెక్టు జాతీయ స్థాయికి ఎంపిక కాగా రాష్ట్రపతి భవన్‌లో తన ప్రాజెక్టును ప్రదర్శించారు. కోవిడ్ కారణంగా జపాన్‌కు వెళ్లలేక పోయారు.



బహుళకర హెల్మెట్ వివరాలను కేంద్ర శాస్త్ర సాంకేతిక మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ తెలుపుతున్న చందనాపూర్ స్కూల్ విద్యార్థి దాసరి హర్షిత (ఫైల్)

పరిసరాల పరిశుభ్రత పాటిస్తే రోగాలు దరిచేరవు: ఆర్డీవో



నిట్టూరులో ఇంటి పరిసరాలను పరిశీలిస్తున్న ఆర్డీవో గంగయ్య

8

హాస్టల్ సరుకుల టెండర్లలో జాప్యం

- 15 రోజులు కావస్తున్నా ఖరారు కాని టెండర్లు

- ఆందోళన చెందుతున్న కాంట్రాక్టర్లు

8

ఓసీపీ-3లో వనమహోత్సవం

- మొక్కలు నాటిన జీఎం

8



మొక్కకు నీరు పోస్తున్న జీఎం

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో కిక్కిరిస్తున్న జనం

8

- రోజురోజుకు పుంజుకుంటున్న రిజిస్ట్రేషన్ల సంఖ్య

-ఆగస్టు 1 నుంచి చార్జీల మోతే కారణం

డ్రగ్స్ రహిత సమాజం కోసం భాగస్వాములు కావాలి

- ఎక్సైజ్ ఎస్ఐ శ్రీనివాస్

కోల్‌సిటీటౌన్, జూలై 13: డ్రగ్స్ రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఎక్సైజ్ ఎస్ఐ శ్రీనివాస్ అన్నారు. జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి మహిపాల్‌రెడ్డి, సీఐ మంగమ్మ ఆదేశాల మేరకు శనివారం గోదావరిఖని మహాత్మాజ్యోతిబాపూలే బాలుర గురుకుల పాఠశాలలో మాదకద్రవ్యాల నిర్మూలనపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ శ్రీనివాస్ మాట్లాడుతూ మాదకద్రవ్యాల వల్ల కలిగే దుష్ప్రభావాలను విద్యార్థులకు అవగాహన కల్పించారు. మత్తుపదార్థాల కోసం యువత చెడు దారులు తొక్కవద్దని సూచించారు.

డ్రగ్స్‌కి అలవాటుపడిన వారిని, డ్రగ్స్ విక్రయిస్తున్న వారి సమాచారం ఉంటే వెంటనే తెలియజేయాలని, చెప్పిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు. అనంతరం విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ శిరీష, ఎక్సైజ్ సిబ్బంది ప్రసాద్, నరేష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

మానవ మనుగడకు మొక్కలు నాటాలి

- మల్కాజ్‌గిరి సీనియర్ సివిల్ జడ్జి సట్టు రవీందర్

సుల్తానాబాద్, జూలై 13: మానవ మనుగడకు చెట్లను కాపాడుకోవముతో పాటు విరివిగా మొక్కలు నాటడమే మన ముందున్న ప్రధాన కర్తవ్యమని మేడ్చల్ జిల్లా మల్కాజ్‌గిరి కోర్టు సీనియర్ సివిల్ జడ్జి సట్టు రవీందర్ అన్నారు. మండలంలోని కొదురుపాక జడ్జి స్వగ్రామం. కాగా గ్రామంలో వనమహోత్సవంలో భాగంగా అధికారులు, గ్రామస్థులు మొక్కలు నాటారు. ఈ సందర్భంగా సీనియర్ సివిల్ జడ్జి సట్టు రవీందర్ ముఖ్య అతిథిగా హాజరై ఆయన తల్లి జ్ఞాపకార్థం మొక్కలను నాటారు. అనంతరం జడ్జి మాట్లాడుతూ చెట్ల పెంపకం అనేదీ ఈ రోజుల్లో చాలా ముఖ్యమని తెలిపారు. వాతావరణంలో ఆక్సిజన్ తగ్గిపోయి ప్రజలు అనారోగ్యాల పాలవుతున్నారని అన్నారు. ప్రస్తుతం సమాజంలో విస్తరించిన గ్లోబలైజేన్ మూలంగా పెద్ద ప్రమాదం ముంచుకొచ్చిందని తెలిపారు. టెలీకమ్యూనికేషన్ చాలా పెరిగిపోయి, రేడియోషన్ ఎంతో వాతావరణంలో ఇమిడిపోయిందన్నారు.

ఈ రేడియోషన్ వాతావరణంలో మన కంటికి కనబడకుండా ఉండి ఆక్సిజన్‌ను తగ్గించి మన ఆనారోగ్యాలకు కారణమవుతుందని వివరించారు. తద్వారా మానవ మనుగడకు ముప్పు ఏర్పడిందనీ, దీనిని నివారించాలంటే మొక్కలు నాటడమే సరైన ప్రత్యామ్నాయమని తెలిపారు. ప్రతీ ఒక్కరూ ఎంతో బాధ్యతతో మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని సూచించారు. అనంతరం ఆంజనేయస్వామి వారి అలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో మాజీ తాజా సర్పంచ్ సాగర్‌రావు, అనందరావు తదితరులు పాల్గొన్నారు.



మొక్క నాటుతున్న సీనియర్ సివిల్ జడ్జి సట్టు రవీందర్



అల్లీపూర్‌లో డీఎంహెచ్‌వో పర్యటన

- ఐదు బృందాలతో జ్వరాలపై ఆరా - భాధితుల వివరాల నమోదు - 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన



అల్లీపూర్‌లో రోడ్డుపై నిలిచిన నీటిని పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో ప్రమోద్‌కుమార్

సుల్తానాబాద్, జూలై 13: 'సుల్తానాబాద్ మండలంలో విజృంభిస్తున్న జ్వరాలు' శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనానికి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి ప్రమోద్ కుమార్ స్పందించారు. గర్రెపల్లి ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అనుదీప్ ఆధ్వర్యంలో ఐదు మెడికల్ బృందాలతో కలసి వైద్య ఆరోగ్య శాఖ జిల్లా అధికారి ప్రమోద్ కుమార్, సీజనల్ వ్యాధుల ప్రోగ్రాం అధికారి సుధాకర్‌రెడ్డి, పలువురు డాక్టర్లు, హెల్త్ సూపర్ వైజర్లు, ఏఎన్ఎంలు, ఆశాలు, జీపీ కార్యదర్శులు అల్లీపూర్ గ్రామంలో శనివారం పర్యటించారు. గ్రామంలో పెద్ద ఎత్తున జ్వరాలతో బాధపడుతున్న వారి పేర్లను నమోదు చేసుకున్నారు. జ్వరాలతో ఉన్న వారి పరిస్థితిని అంచనా వేసి వారికి తగు సలహాలు సూచనలు అందజేశారు. గ్రామంలో జ్వరాలతో బాధపడుతన్న వారి సంఖ్య ఎక్కువగా ఉండడం, మరో వైపు సుల్తానాబాద్ ప్రభుత్వ ఆసుపత్రిలో కూడా ఈ గ్రామానికి చెందిన వారే చేరడంతో మద్దికుంట, అల్లీపూర్ గ్రామాల ప్రజలు భయాందోళన చెందుతున్నారు. శనివారం ఉదయం ఆరుగంటలకు ఐదు బృందాలు గ్రామానికి చేరుకుని గ్రామంలో పారిశుధ్యం నిర్వహణ పరిశీలించారు. పారిశుధ్య నిర్వహణ పూర్తి అధ్వానంగా ఉందని వీరి పరిశీలనలో తేలింది. ఎక్కడికక్కడే మురుగునీరు నిల్వ ఉండడం, గ్రామంలో కాలువల నిర్వహన సక్రమంగా లేకపోవడం, దానికి తోడు దోమల సంఖ్య పెరిగే విధంగా చాలా మంది ఇళ్లలో పాత్రల్లో నీటిని నిల్వ చేసి ఉంచడం, వాటిలో లార్వా ఉత్పత్తి కావడం వంటిని గమనించారు. ఇలా తొట్టెలలో, కూలర్లలో, ప్లాస్టిక్ క్యాన్‌లు ఇతర పాత్రల్లో నీటిని నిల్వ ఉంచడం వలన దోమల సంతతి ఉత్పత్తి అయి వాటి ద్వారా జ్వరాలు వస్తున్నాయని, ఇలాగే ఉంటే చాలా మందికి డెంగ్యూ వచ్చే ప్రమాదం ఉందని అధికారులు ప్రజలకు అవగాహన కల్పించారు. మరో వైపు అల్లీపూర్ ప్రజలకు నీటిని అందించే రక్షిత మంచినీటి బావి పూర్తి అపరిశుభ్రంగా, అందులో నీరంతా కలుషతం అయి ఉంది. బావి పరిసరాలను శుభ్రపరచాలని సూచించారు. ఎంపీడీవో దివ్యదర్శన్ రావు, ఎంపీవో ఫయాజ్ అలీ, అల్లీపూర్ గ్రామపంచాయతీ ప్రత్యేకాధికారి, పీఆర్ ఏఈ సతీష్, పంచాయతీ కార్యదర్శి సతీష్ తదితరులు కూడా జ్వరాల నివారణ చర్యలను పర్యవేక్షించారు.

- **సోమవారం వైద్య శిబిరం..**

గ్రామంలో చాలా మంది జ్వరాలతో బాధపడుతున్న నేపథ్యంలో గ్రామంలో సోమవారం వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేస్తామని పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అనుదీప్ తెలిపారు. ఈ శిబిరంలో పలు రకాల రక్త, జ్వర పరీక్షలు నిర్వహిస్తామని అందరూ వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.



జ్వర బాధితుడి వివరాలు సేకరిస్తున్న వైద్య బృందం

గ్రామాల అభివృద్ధే ఎమ్మెల్యే లక్ష్యం

మాజీ ఎంపీపీ గోపగోని సారయ్యగౌడ్



స్వీట్ తినిపించుకుంటున్న కాంగ్రెస్ నాయకులు

కాల్వశ్రీరాంపూర్, జూలై 13: గ్రామాల అభివృద్ధి ఎమ్మెల్యే విజయరమణారావు లక్ష్యమని మాజీ ఎంపీపీ గోపగోని సారయ్యగౌడ్ అన్నారు. కాల్వశ్రీరాంపూర్-పొత్కపెల్లి రహదారికి నిధులు మంజూరైన సందర్భంగా కాంగ్రెస్ నాయకులు శనివారం స్వీట్లు పంచుకున్నారు. అనంతరం మండల కేంద్రంలో హుస్సేన్‌మియావాగుకు వెళ్లే దారిలో రహదారి మారమ్మతులను మాజీ ఎంపీపీ సారయ్యగౌడ్ కాంగ్రెస్ నాయకులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా సారయ్యగౌడ్ మాట్లాడుతూ కొన్ని సంవత్సరాలుగా కాల్వ శ్రీరాంపూర్ నుంచి ఓదెల మండలం పొత్కపెల్లి రహదారి అధ్వానంగా తయారైన విషయంపై ఎమ్మెల్యే స్పందించి డబుల్ రోడ్డు నిర్మాణానికి సీఆర్ఎఫ్ నిధుల నుంచి రూ.25కోట్లు మంజూరు చేశారన్నారు. అదేవిధంగా కాల్వశ్రీరాంపూర్‌లో నల్లల బాయి నుంచి హుస్సేన్‌మియా వాగు వెళ్లే రైతుల రహదారికి మరమ్మతులకు నిధులు మంజూరు చేశారన్నారు. ఎమ్మెల్యేగా ఎన్నికైన అనతికాలంలోనే గ్రామగ్రామాన సీసీ రోడ్లు వేయడం జరిగిందన్నారు. కాల్వ శ్రీరాంపూర్ మండల అభివృద్ధికి ప్రభుత్వం నుంచి అధిక నిధులు తీసుకొస్తున్న ఎమ్మెల్యేకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గాజనవేన సదయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి పులి ఇంద్రకరణ్‌రెడ్డి, నాయకులు బంగారు రమేష్, అల్లం దేవేందర్, సబ్బని రాజమల్లు, గోలి సుధాకర్, శివరామకృష్ణ, మాదాసు సతీష్, పోశాల సదానందం, అటికం శంకర్‌గౌడ్, మాజీ ఎంపీటీసీ రావి సదానందం, గాజుల మోహన్ పాల్గొన్నారు.

ఎస్సీ ఎస్టీ కేసుపై డీఎస్పీ విచారణ

బీర్‌పూర్,జులై 13: బీర్‌పూర్ మండలంలోని కొల్వాయి గ్రామంలో శనివారం జగిత్యాల డీఎస్పీ రఘుచంధర్ ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు విషయంలో విచారణ చేపట్టారు. ఈ నెల 11న తమను కులం పేరుతో దూషించారని కామెర రాజేశ్వర్ అనే వ్యక్తి కొల్వాయి గ్రామానికి చెందిన రామకిష్టు గంగాధర్ కుటుంబ సభ్యులపై ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

ఈ కేసు విషయంలో జగిత్యాల డీఎస్పీ రఘుచందర్, రూరల్ సీఐ కృష్ణారెడ్డి, బీర్‌పూర్ ఎస్సై కుమారస్వామిలు గ్రామంలో విచారణ చేపట్టారు. ఈ కార్యక్రమంలో వారి వెంట సిబ్బంది ఉన్నారు.

గట్టుదుద్దెనపల్లిలో కాపర్‌వైరు చోరీ

మానకొండూర్, జూలై 13 : మండలంలోని గట్టుదుద్దెనపల్లి గ్రామంలో కాపర్ వైరు చోరీకి గురైంది. గ్రామంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలో ట్రాన్స్‌ఫార్మర్‌ను శుక్రవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు పగులకొట్టి సుమారు రూ. 30వేల విలువ గల కాపర్ వైర్‌ను దొంగిలించారు. చంజర్ల ఏఈ రమేశ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

డమ్మీ తుపాకీతో కనిపించిన యువకుడు

● అదుపులోని తీసుకొని కౌన్సెలింగ్ ఇచ్చి పంపించిన పోలీసులు

బీర్‌పూర్, జూలై 13: పోలీసులు పెట్రోలింగ్ చేస్తున్న సమయంలో డమ్మీ తుపాకీతో మండలానికి చెందిన ఓ యువకుడు బీర్‌పూర్ జిల్లా పరిషత్ పాఠశాల సమీపంలో కనిపించగా అదుపులోకి తీసుకున్నారు. అతని నుంచి వివరాలు తీసుకుని కౌన్సెలింగ్ ఇచ్చి పంపించినట్లు ఎస్సై కుమారస్వామి తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. శనివారం మధ్యాహ్నం పోలీస్ సిబ్బంది పెట్రోలింగ్ చేస్తుండగా బొమ్మ తుపాకీ కలిగి ఉన్న యువకుడు పాఠశాల సమీపంలో కన్పించడంతో అదుపులోనికి తీసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించి విచారించారు. ఆ బొమ్మ తుపాకీని ఫొటోషూట్ కోసం అమెజాన్‌లో కొనుగోలు చేశానని తెలుపగా, యువకుడికి కౌన్సిలింగ్ ఇచ్చి పంపించామన్నారు.

ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్‌ను కలిసిన నాయకులు

సుభాష్‌నగర్, జూలై 13: తెలంగాణ రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ నాగరి ప్రీతంను ఎంఆర్‌పీఎస్, తెలంగాణ అంబేడ్కర్ యువజన సంఘం రాష్ట్ర కన్వీనర్ గోష్కి శంకర్, ఎంఆర్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు గాలిపెల్లి శ్రీనివాస్ కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సీల అభివృద్ధికి తోడ్పడాలని ఆయనను కోరారు.

కృష్ణ యతీంద్ర రామానుజ జీయర్ స్వామి మృతి


కృష్ణ యతీంద్ర రామానుజ జీయర్ స్వామి (ఫైల్)

కరీంనగర్ కల్చరల్, జూలై 13: కరీంనగర్‌కు చెందిన పరమహంస పరివ్రాజకాచార్యులు త్రిదండి శ్రీకృష్ణ యతీంద్ర రామానుజ జీయర్ స్వామి (89) అనారోగ్యంతో కరీంనగర్‌లో శుక్ర వారం రాత్రి మృతి చెందారు. కొన్ని నెలలుగా అనారోగ్యంతో ఉన్న స్వామి హైదరాబాద్‌లో చికిత్స తీసుకున్నారు. దేశ వ్యాప్త విశిష్టాద్వైత జీయర్ స్వాముల్లో ఆయన ఒకరు. ఆయన మెట్‌పల్లి ఖాదీ విలేజ్ కమిషన్ బోర్డ్‌లో అడ్మిని స్ట్రేటివ్ ఆఫీసర్‌గా పనిచేసి రిటైర్డ్ అయ్యారు. అనంతరం సన్యాసం స్వీకరించారు. ఆయన తెలుగు, హిందీ, ఇంగ్లీష్, సంస్కృత భాషలతో పాటు జ్యోతిషంలో పలు గ్రంథాలు రచించారు. జూలై 2004లో ఆయన సన్యాసాశ్రమం స్వీకరించారు. స్వామి మృతిపై పలువురు సంతాపం తెలిపారు. స్వామీజీ పార్థివ దేహాన్ని ఆయన కోరిక మేరకు పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మండలం, నీరుకుళ్ల రంగనాయకస్వామి వెలసిన మానేరు నది ఒడ్డున యతీశ్వర సాంప్రదాయం ప్రకారం బృందావనంలో ఖననం చేశారు.

శంషాబాద్‌కు రాజధాని బస్సులు

భగత్‌నగర్, జూలై 13: జగిత్యాల డిపో నుంచి శంషాబాద్‌కు రాజధాని బస్సులు నడిపించనున్నట్లు ఆర్టీసీ రీజినల్ మేనేజర్ ఎన్ సుచరిత ఒక ప్రకటనలో తెలిపారు. 15వ తేదీ సోమవారం నుంచి జగిత్యాల డిపో నుంచి బయలుదేరే రాజధాని బస్సులు ఉప్పల్ క్రాస్‌రోడ్, ఎల్‌బీనగర్, మీదుగా శంషాబాద్ చేరుకుంటాయన్నారు. జగిత్యాల నుంచి శంషాబాద్‌కు సాయంత్రం 4.30, 8.00 గంటలకు, కరీంనగర్ నుంచి శంషాబాద్‌కు సాయంత్రం 5.45, 9.30 గంటలకు, శంషాబాద్ నుంచి కరీంనగర్/జగిత్యాలకు ఉదయం 7.15, 8.00 గంటలకు బస్సులు ఉంటాయన్నారు. ఈ అవకాశాన్ని ప్రయాణికులు వినియోగించుకోవాలని కోరారు.

ఓదెలలో సుబేదర్ గంజ్ ఎక్స్‌ప్రెస్ రైలు నిలిపివేత

ఓదెల, జూలై 13: మండల కేంద్రంలోని రైల్వే స్టేషన్‌లో సికింద్రాబాద్ నుంచి సుబేదర్ గంజ్ వైపు వెళ్లే ఎక్స్‌ప్రెస్ రైలును అధికా రులు శనివారం రెండు గంటల పాటు నిలిపివేశారు. అప్‌లైన్లో వ స్తున్న ఎక్స్‌ప్రెస్ రైలుకు ముందు న్న కొలనూర్ రైల్వేస్టేషన్‌లో లైన్ క్లియర్ లేకపోవడంతో, ఉదయం 10 గంటలకు వచ్చిన ఎక్స్ ప్రెస్ రైలు ఓదెలలో నిలిపి వేశారు. 12 గంటల తర్వాత అధికారులు కిలో మీటర్ వెనుకకు పంపించి మరో లైన్ ద్వారా సుబేదార్ గంజ్ వైపు పంపించారు. దీంతో పొత్కపల్లి, కొలనూర్, ఓదెల స్టేషన్లలో రైళ్ల రాకపోకలకు తీవ్ర అంత రాయం ఏర్పడింది. వివిధ గ్రామాల నుంచి మండల కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చిపోయే ప్రజలు ఓదెల గేటు వద్దనే ఆగిపోయారు.

ఎస్సారెస్పీలోకి కొనసాగుతున్న ఇన్‌ఫ్లో

జగిత్యాల, జూలై 13 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి ఎగువ ప్రాంతాల నుంచి ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. ఎస్సారెస్పీలోకి శనివారం 1,852 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చింది. ప్రాజెక్టు సామర్థ్యం 90.323 టీఎంసీలకు ప్రస్తుతం 12.556 టీఎంసీల నీరు నిల్వ ఉంది. గత యేడాది ఇదే సమయానికి ప్రాజెక్టులో 17.802 టీఎంసీల నిల్వ ఉంది. ప్రాజెక్టు నుంచి 494 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. జూన్ 1 నుంచి ఇప్పటివరకు ప్రాజెక్టులోకి 6.775 టీఎంసీల నీరు వచ్చి చేరింది.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

ముస్తాబాద్, జూలై 13: మండలంలోని బందనకల్ శివారులో మూడు రోజుల క్రితం ఆత్మహత్యాయత్నం చేసిన సిద్దిపేట జిల్లా కేంద్రంలోని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న యువకుడు శనివారం మృతి చెందాడు. ముస్తాబాద్ ఎస్సై శేఖర్‌రెడ్డి వివరాల ప్రకారం.. గంభీరావుపేట మండలం లింగన్నపేట గ్రామానికి చెందిన తుడుము శ్రీనాథ్ (24) 10వ తేదీన బందనకల్ శివారులో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. గమనించిన స్థానికులు సిద్దిపేటలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో శనివారం మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. శ్రీనాథ్ ప్రేమ విషయంలో మనస్తాపం చెంది పురుగుల మందు తాగి చనిపోయడాని ఆయన చెప్పారు.

పురుగుల మందు తాగి మహిళ ఆత్మహత్య


గుగులోతు సరోజ (ఫైల్)

వీర్నపల్లి, జూలై 13: మండల కేంద్రానికి చెందిన గుగులోతు సరోజ (55) అనే మహిళ శనివారం పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంది. సరోజ కూలి పని చేసుకుంటూ జీవనం సాగిస్తోంది. ఆమె భర్త పీర్యా గతంలో అనారోగ్యంతో మృతి చెందాడు. ముగ్గురు కూతుళ్లకు పెళ్లిళ్లు చేయడంతో ఆర్థిక ఇబ్బందులు తలెత్తాయి. దీనికి తోడు అనారోగ్య సమస్యలు రావడంతో ఆవేదనకు గురై శుక్రవారం సాయంత్రం ఇంట్లో ఎలుకల మందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు ఎల్లారెడ్డిపేటలోని ఆసుపత్రికి తరలించగా శనివారం మృతి చెందింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రిలే నిరాహారదీక్షకు అనుమతి ఇవ్వండి


తంగళ్లపల్లి పోలీస్ స్టేషన్‌కు వచ్చిన నేరెళ్ల బాధితుడు హరీష్

తంగళ్లపల్లి, జూలై 13: న్యాయం కోసం రిలే నిరాహార దీక్ష చేపడు తున్నానని, దానికి అనుమతి కావాలని నేరెళ్ల బాధితుడు కోల హరీష్ తంగళ్లపల్లి పోలీసులకు శనివారం వినతి పత్రం అందజేశాడు. 2017 సంవత్సరంలో కొతమంది పోలీస్ అధికారులు తమపై థర్డ్ డిగ్రీ ప్రయోగించారని, చిత్ర హింసలకు గురిచేశారని ఆరోపించారు. అధికారు లపై చర్యలు తీసుకోవాలని విన్నవిం చినా అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఆ అధికారులపై చర్యలు తీసుకోవాలని ఈ నెల 17వ తేదీన నేరెళ్ల గ్రామ పంచాయతీ ఎదుట రిలే నిరాహారదీక్ష చేపడుతున్నట్లు తెలిపాడు. దీనికి పోలీసులు అనుమతులు ఇవ్వాలని వినతిపత్రంలో కోరారు.

రైలు కిందపడి వృద్ధురాలి మృతి

జమ్మికుంట, జూలై 13: జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని కొత్తపల్లికి చెందిన ఆకుల లక్ష్మి (శీౌ) ఖాళీ వాటర్ బాటిళ్ళు ఏరుకుంటూ జీవనం సాగిస్తుంది. రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద పట్టాలు దాటుతుండగా ప్రమాదవశాత్తు ఎక్స్‌ప్రెస్ రైలు ఢీకొని మృతి చెందింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రామగుండం రైల్వే హెడ్ కానిస్టేబుల్ జి తిరుపతి తెలిపారు.

15 మంది మందుబాబుల అరెస్ట్

సిరిసిల్ల క్రైం, జూలై 13: సిరిసల్ల పట్టణం శాంతినగర్ ప్రాంతంలో శనివారం బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగిన మందుబాబులను పోలీసులు అరెస్ట్ చేశారు. మద్యంబాటి ళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు 15 మందిపై కేసు నమోదు చేసి 5 ఆటోలు సీజ్ చేసినట్లు టౌన్ సీఐ కృష్ణ తెలిపారు.

అనారోగ్యంతో పోలీస్ జాగిలం మృతి


నివాళులర్పిస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్

తంగళ్లపల్లి, జూలై 13: పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో ఎనిమిదేళ్లుగా విధులు నిర్వహిస్తున్న జర్మన్ షెపర్డ్ సంతతికి చెందిన పోలీస్ జాగిలం ట్యాంగో అనారోగ్యంతో శనివారం మృతి చెందింది. తంగళ్లపల్లి మండలం తాడూర్ గ్రామం లోని పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో ఎస్పీ అఖిల్‌మహజన్, పోలీస్ అధికారులు, పోలీస్ డాగ్ హ్యాండ్లర్ లక్ష్మణ్ నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ట్యాంగో ఎమిదేళ్లలో జిల్లాలో 15 హత్య కేసులు, 84 దొంగతనాలు, మొత్తం 99 కేసుల్లో విధులు నిర్వహించినట్లు చెప్పారు. 2017లో ట్యాంగో తన హ్యాండ్లర్ లక్ష్మణ్‌తో కలిసి ఐబీటీఏ మెయినాబాద్‌లో ఎనిమిది నెలల బేసిక్ ట్రెయినింగ్ పూర్తి చేసుకుని జిల్లాకు వచ్చిందన్నారు. కార్యక్రమంలో ఏఎస్పీ చంద్రయ్య, ఆర్‌ఐలు యాదగిరి, మధుకర్, రమేష్, రాజు పాల్గొన్నారు.

అర్బన్‌బ్యాంక్ పాలకవర్గం బాధ్యతల స్వీకరణ


అర్బన్ బ్యాంక్ పాలకవర్గ సభ్యులు

కరీంనగర్ అర్బన్, జూలై 13: కరీంనగర్ కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లిమిటెడ్ పర్సన్ ఇన్‌చార్జి కమిటీ సభ్యులు శనివారం పదవీ బాధ్యతలు చేపట్టారు. సీఈవో ఎన్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో సభ్యులు బాధ్యతలు స్వీకరించారు. అర్బన్ బ్యాంక్ పాలకవర్గం పదవీ కాలం రెండు నెలల క్రితం ముగిసింది. కొత్త పర్సన్ ఇన్‌చార్జి కమిటీని ఏర్పాటు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 8న జీవో విడుదల చేసింది. అర్బన్ బ్యాంక్ చైర్మన్‌గా కరీంనగర్ అదనపు కలెక్టర్ వ్యవహరించనుండగా, పర్సన్ ఇన్‌చార్జి కమిటీ సభ్యులుగా డిస్ట్రిక్ట్ కో ఆపరేటివ్ ఆఫీసర్‌తో పాటు గడ్డం విలాస్ రెడ్డి, మడుపు మోహన్, ముక్క భాస్కర్, బీరం ఆంజనేయులు, మహ్మద్ కలీంఖాన్, రేగొండ సందీప్, మూల లక్ష్మీరవీందర్‌రెడ్డి, ఎ విద్యాసాగర్, ఇ లక్ష్మణ్‌రాజు, ఎండీ సమియొద్దీన్, మంగి రవీందర్‌ను నియమించారు. ఈ సందర్భంగా పాలకవర్గ సభ్యుడు గడ్డం విలాస్‌రెడ్డి మాట్లాడుతూ పాలకవర్గ నియామకానికి సహకరించిన మంత్రి పొన్నం ప్రభాకర్, కాంగ్రెస్ అధిష్ఠానానికి కృతజ్ఞతలు తెలిపారు. అర్బన్ బ్యాంక్‌ను అన్ని విధాలా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామన్నారు. ఖాతాదారులు, బ్యాంక్ సిబ్బంది సహకారంతో కలిసి అభివృద్ధి చేస్తామన్నారు. కొన్ని సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న డివిడెండ్ ఫండ్‌ను మూడు నెలల్లో విడుదల చేసేందుకు కృషి చేస్తామన్నారు. త్వరలోనే గంగాధర నూతన బ్రాంచి ప్రారంభోత్సవంతోపాటు కరీంనగర్ మెయిన్ బ్రాంచి పరిధిలో ఏటీఎం సెంటర్‌ను ప్రారంభిస్తామన్నారు. నూతన పర్సన్ ఇన్‌చార్జి కమిటీ సభ్యులను బ్యాంక్ సిబ్బంది ఈ సందర్భంగా సన్మానించింది. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు అబ్దుల్ రహమాన్, కాంరెడ్డి రాంరెడ్డి, మూల రవీందర్‌రెడ్డి, సర్దార్ దన్నాసింగ్, పోరండ్ల రమేష్, ఎండీ అమీర్, మూల జైపాల్, గంగుల దిలీప్, అనరాసు కుమార్, కుర్ర పోశయ్య, గుండాటి శ్రీనివాస్‌రెడ్డి, మహ్మద్ షబానా, లింగమూర్తి, రాజ్‌కుమార్, జ్యోతి, ఇమ్రాన్, షాన్‌వాజ్, అంజయ్యగౌడ్ పాల్గొన్నారు.

అప్పుల బాధతో యువకుడి ఆత్మహత్య

జగిత్యాలరూరల్, జూలై 3: అప్పుల బాధ భరించలేక మండలంలోని మోతె చెరువులో దూకి జగిత్యాల పట్టణానికి చెందిన ఏదుల కిషోర్ (46) ఆత్మహత్యకు చేసుకున్నాడని జగిత్యాల రూరల్ ఎస్సై సధాకర్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం కిషోర్ పట్టణంలోని జంబిగద్దె ప్రాంతంలో కిరాణం నడుపుతూ జీవిస్తున్నాడు. షాపు నిర్వహణకు ఐదు లక్షల రూపాయలు అప్పు చేశాడు. కొన్ని రోజుల నుంచి దుకాణం నడవడం లేదు. దీంతో చేసిన అప్పు తీర్చే మార్గం లేక మనస్తాపం చెంది చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డట్లు ఎస్సై తెలిపారు.

● **నమిలకొండలో..**

కొడిమ్యాల: మండలంలోని నమిలకొండ గ్రామానికి చెందిన శతరాసి సురేష్ (39) అనే యువకుడు ఆత్మహత్య చేసుకున్నట్లు గ్రామస్థులు పోలీసులు శనివారం తెలిపారు. సురేష్ కొద్ది రోజులుగా కడుపు నొప్పితో బాధపడుతున్నాడు. ఆసుపత్రులో చూపించుకున్నా నయం కాలేదు. దీంతో జీవి తంపై విరక్తి చెంది ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఘనంగా జగన్నాథ రథయాత్ర


రథానికి నమస్కరిస్తున్న భక్తులు

రాయికల్, జూలై 13: రాయికల్ పట్టణంలో ఇస్కాన్ ఆధ్వర్యంలో జగన్నాథ రథయాత్రను శనివారం ఘనంగా నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ మోర హన్మాండ్లు రథయాత్రను ప్రారంభించారు. రథం ముందు రోడ్డును ఊడ్చి మహిళలు పెద్ద ఎత్తున స్వాగతం పలికారు. స్థానిక అంగడి బజార్‌లో ప్రారంభమైన యాత్ర గాంధీ విగ్రహం నుంచి పటేల్ బొమ్మ మీదుగా శివాజీ చౌక్ నుంచి తిరిగి పాత బస్టాండ్ వరకు చేరుకుంది. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు, రథయాత్ర కమిటీ సభ్యులు, యువకులు, శ్రీకృష్ణ భక్తులు పాల్గొన్నారు.

ధర్మపురిలో భక్తుల రద్దీ


ధర్మపురి ఆలయంలో క్యూలో వేచి ఉన్న భక్తులు

ధర్మపురి, జూలై 13: ధర్మపురి లక్ష్మీనరసింహ స్వామిని శనివారం భక్తులు పెద్ద సంఖ్యలో దర్శించుకున్నారు. అనుబంధ ఆలయాలు భక్తులతో కిట కిటలాడాయి. భారీగా తరలి వచ్చిన భక్తులు గోదావరి నదిలో పుణ్య స్నానాలు ఆచరించారు. అక్కడి నుంచి భక్తులు ఆలయాలకు చేరుకుని స్వామిని దర్శించుకున్నారు. ఆలయ వేద పండితులు బొజ్జ రమేష్‌శర్మ, సామవేద పండితులు ముత్యాలశర్మ మంత్రోచ్చరణల మధ్య అర్చకులు నిత్య పూజలు అభిషేకాది కార్యక్రమాలు నిర్వహించారు. ఈవో సంకటాల శ్రీనివాస్, సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్‌కుమార్, ఉప ప్రధాన అర్చకులు నేరెళ్ల శ్రీనివాసాచార్యులు, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, ముఖ్య అర్చకులు నంబి శ్రీనివాసాచారి, రమణాచారి, నరసింహమూర్తి, వేదపారాయణదారు పాలెపు ప్రవీణ్‌కుమార్‌శర్మ పాల్గొన్నారు. ధర్మపురి లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో జరిగే నిత్యాన్నదానం కోసం నిజామాబాద్ జిల్లాకు చెందిన శ్రీ సరిపల్లి ధర్మవాసవి దంపతులు 1,00,116 రూపాయల శనివారం ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్‌కు అందించారు.

'చెక్‌డ్యాంకు మరమ్మతులు చేయాలి'

తంగళ్లపల్లి జూలై 13: తంగళ్లపల్లి శివారులోని మానేరు నదిలో నిర్మించిన చెక్‌డ్యాం వరదలకు కొట్టుకు పోయిందని, ఆ చెక్‌డ్యాంకు మరమ్మతులు చేయాలని స్థానిక రైతులు, గీత కార్మికులు కోరారు. శనివారం తంగళ్లపల్లి మండలంలో పర్యటించిన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌ను రైతులు కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంట్రాక్టర్ నాసిరకం పనులతో వరదకు చెక్ డ్యాం కొట్టుకుపోయిందన్నారు. వ్యవసాయ భూమితోపాటు గీతకార్మికుల తాటి చెట్లు పెంచుతున్న భూమి కోతకు గురై తీవ్ర నష్టం వాటిల్లిందన్నారు. చెక్‌డ్యాం తెగిపోవడంతో ఏర్పడ్డ నీటి గుంతలో పడి చిన్నారులు మృతి చెందారన్నారు. జరిగిన నష్టానికి పరిహారం చెల్లించేలా చర్యలు తీసుకోవడం తోపాటు త్వరగా మరమ్మతులు చేపట్టి చెక్‌డ్యాంను వినియోగంలోకి తేవాలని విజ్ఞప్తి చేశారు. వర్షాలు పడితే తెగిన చెక్‌డ్యాంతో ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందని, ఆలోపే పనులు ప్రారంభించాలని కోరారు. కార్యక్రమంలో రైతులు, గీత కార్మికులు ఎడ్మాల తిరుమలరెడ్డి, ఎడ్మాల బాల్‌రెడ్డి, బండి సత్తయ్య కొండయ్య గౌడ్ పాల్గొన్నారు.

ఘనంగా త్రిశక్తి ఆలయ వార్షికోత్సవం


కుంకుమ పూజల్లో పాల్గొన్న మహిళలు

మెట్‌పల్లి, జూలై 13: పట్టణంలోని త్రిశక్తి ఆలయం వార్షికోత్సవాన్ని నిర్వాహకులు శనివారం ఘనంగా నిర్వహించారు. ఆలయంలో మహిళలతో కుంకుమ పూజ జరిపించారు. ఈ సంద ర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ రానావేణి సుజాత-సత్య నారాయణ దంపతులు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జువ్వాడి కృష్ణారావు పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నిర్వాహకులు వారిని శాలువతో సన్మానించి ప్రసాదం అందజేశారు. కార్యక్రమంలో జెట్టి లింగం తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ కళాశాల భూములకు పరిహారం ఇప్పించండి


ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు వినతి పత్రాన్ని అందజేస్తున్న భూ నిర్వాసితులు

సిరిసిల్ల రూరల్, జూలై 13: సిరిసిల్ల అర్బన్ పరిధిలోని పెద్దూర్ శివారులో మెడికల్ కళాశాల భవన నిర్మాణానికి తీసుకున్న భూములకు నష్టపరిహారం ఇప్పించి తమను ఆదుకోవాలని నిర్వాసితులు కోరారు. సిరిసిల్లలో శనివారం ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, సిరిసిల్ల నియోజకవర్గం ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డికి వినతి పత్రాలను అందజేశారు. సిరిసిల్ల అర్బన్ పరిధిలోని పెద్దూర్ శివారులోని సర్వేనంబరు 408లో ఉన్న 36 ఎకరాల భూముని మెడికల్ కళాశాల భవనాల నిర్మాణాల కోసం గత ప్రభుత్వం కేటాయించిందని తెలిపారు. భూములను కోల్పోయిన తమకు మరోచోట భూములను అందిస్తామని మాజీ మంత్రి, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ హామీ ఇచ్చారని చెప్పారు. ఆ భూముల్లో భవనాలను నిర్మించారని, నష్టపరిహారం మాత్రం ఇవ్వడం లేదని అన్నారు. కలెక్టర్‌తోపాటు ఆర్డీవోను అడిగితే తమపైనే అక్రమ కేసులను పెట్టించారని, ఇబ్బందులకు గురి చేస్తున్నారని వివరిం చారు. తమ భూములకు నష్టపరిహారంతోపాటు మరోచోట భూములను అందించాల ని కోరారు. పట్టణ పరిధిలోని విలీన గ్రామాలైన సర్దాపూర్, పెద్దూర్ గ్రామాలు ప్రభుత్వ భూముల్లోనే ఉన్నాయని, ఆ గ్రామాల్లో ఎలాంటి నిర్మాణాలను చేపట్టాలన్నా మున్సిపల్ అధికారులు అనుమతులు ఇవ్వడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ భూముల్లో నిర్మాణాలను చేపట్టేందుకు పట్టాలను అందించి అనుమతులను ఇప్పించాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాష్, గడ్డం నర్సయ్య, తొమ్మిదో వార్డు కౌన్సిలర్ లింగంపల్లి సత్యనారాయణ, పెద్దూర్ సింగిల్ విండో చైర్మన్ జీల కిషన్‌యాదవ్, సలేంద్రి బాలరాజుయాదవ్, మెడుదుల దేవయ్యయాదవ్, గొడుగు మల్లేశం, గొడుగు పర్శరాములు, గొడుగు చిన్నఎల్లయ్య, నాగుల లక్ష్మీ, సలేంద్రి రాజ్యలక్ష్మి, లింగంపల్లి అశోక్, లింగంపల్లి భూలక్ష్మీ, ఎనగందుల ప్రేమల, ఉలిసే తిరుపతి, బడుగు భూమయ్య పాల్గొన్నారు.

పోగొట్టుకున్న ఫోన్లు అప్పగింత

ధర్మపురి, జూలై 13: ధర్మపురి పట్టణానికి చెందిన మెరుగు శ్రీనివాస్, గొల్లపల్లి మండలంలోని బొంకూర్ గ్రామానికి చెందిన ఐతం వెంకటేష్ గత నెలలో సెల్ ఫోన్లు పోగొట్టుకున్నారు. సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ఫోన్లను గుర్తించిన ఎస్‌ఐ ఉదయ్‌కుమార్ వాటిని స్వాధీనం చేసుకుని శ్రీనివాస్, వెంకటేష్‌కు శనివారం అప్పగించారు.

వృద్ధుడి మృతదేహం గుర్తింపు


నారాయణస్వామి మృతదేహం

కరీంనగర్ క్రైం, జూలై 13: కరీంనగర్ సప్తగిరి కాలనీ మాచర్ల గార్డెన్ వెనుక వైపున ఓ వృద్ధుడి మృతదేహం లభ్యమైందని కరీంనగర్ టూ టౌన్ హెడ్ కానిస్టేబుల్ రవీందర్ తెలిపారు. మృతుడి వద్ద లభించిన ఆధార్‌కార్డులో పెద్దపల్లి నారాయణస్వామి (70), మార్కండేయనగర్ అని చిరునామా ఉందన్నారు. ఆ చిరునామా ప్రకారం ఇంటి నంబర్‌ను తనిఖీ చేయగా ప్రభుత్వ పాఠశాలదిగా వెల్లడైందని తెలిపారు. మృతుడు నారాయణకు సంబంధించిన వారు కరీంనగర్ రెండో టౌన్ సీఐ (8712670762) లేదా ప్రభుత్వ ఆసుపత్రి అవుట్ పోస్ట్ హెడ్‌కానిస్టేబుల్ కె రవీందర్ (9491481433)క సంప్రదించాలని సూచించారు. మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రిలోని మార్చురీలో భద్రపరిచామని తెలిపారు.

ఐదు క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

వీణవంక, జూలై 13: మండలంలోని మామిడాలపల్లిలో ఆటో ట్రాలీలో అక్రమంగా తరలిస్తున్న ఐదు క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని శనివారం పోలీసులు పట్టుకున్నారు. పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మండలం మార్కండేయ కాలనీకి చెందిన చింతల కిరణ్ అనే వ్యక్తి ఆటో ట్రాలీలో రేషన్ దుకాణాల నుంచి కొనుగోలు చేసిన బియ్యాన్ని ఎక్కువ ధరకు ఇతరులకు విక్రయిస్తున్నారని గుర్తించిన పోలీసులు బియ్యం స్వాధీనం చేసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కిరణ్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ టి తిరుపతి తెలిపారు.

● శంకరపట్నం: శంకరపట్నం మండలం కేశవపట్నం గ్రామ శివారులో అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యాన్ని శనివారం ఎస్‌ఐ పాకాల లక్ష్మారెడ్డి పట్టుకున్నారు. దిరావత్ పాండు, దిరావత్ చందా, దిరావత్ శ్రీను మూడు ఆటోల్లో 18 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని తరలిస్తుండగా పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పాకాల లక్ష్మారెడ్డి తెలిపారు.

ఎక్సైజ్ అధికారుల దాడులు

రాయికల్, జూలై 13: మండలంలోని రాజ్‌నగర్ తండా, ధర్మాజీపేట గాంధీ తండాలలోని నాటుసారా స్థావరాలపై శనివారం జిల్లా ఎక్సైజ్ అధికారి సత్యనారాయణ ఆదేశాల మేరకు ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా 250 లీటర్ల బెల్లం పానకం, నాటుసారా తయారీ సామగ్రిని ధ్వంసం చేశారు. ప్రభుత్వం నిషేధించిన గుడుంబా తయారు చేసినా, అమ్మినా, కలిగి వున్నా వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దాడుల్లో జగిత్యాల ఎక్సైజ్ సీఐ సర్వేశ్వర్, జిల్లా టాస్క్‌ఫోర్స్ సీఐ రాజమౌళి, ఎస్సై స్వప్న పాల్గొన్నారు.

గల్ఫ్ నుంచి స్వగ్రామం చేరిన మృతదేహం


తునికి శేఖర్ (ఫైల్)

రాయికల్, జూలై 13: మండలంలోని కొత్తపేటకు చెందిన తునికి శేఖర్ (27) అనే యువకుడు దుబాయ్‌లోని షార్జాలో 20 రోజుల క్రితం ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యులు, గ్రామస్థులు ఈ విషయాన్ని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లారు. ఆయన దుబాయ్‌లోని ఇండియన్ కాన్సులేట్, విదేశాంగ మంత్రి జై శంకర్‌తో మాట్లాడారు. జీడబ్ల్యూపీసీ సమక్షంలో అధ్యక్షుడు గుండెల్లి నరసింహ, బొడ్డుపల్లి రాములు ఆధ్వర్యంలో యువకుడు పని చేస్తున్న బియ కంపెనీతో మాట్లాడారు. వారి ప్రయత్నంతో శేఖర్ మృతదేహం శనివారం స్వగ్రామానికి చేరుకుంది.

● జగిత్యాలరూరల్ : జగిత్యాల రూరల్ మండలం హబ్సీపూర్ గ్రామానికి చెందిన వంగ సురేష్ (38) ఇరాక్ లో ఇటీవల మృతి చెందాడు. శనివారం ఆయన మృతదేహం స్వగ్రామానికి చేరుకుంది. గత నెల 23న సురేష్‌కు పక్షవాతం రావడంతో ఆస్పత్రిలో చేరాడు. చికిత్స పొందుతున్న సమయంలో గుండెపోటుకు గురై చెందినట్లు గ్రామస్థులు తెలిపారు. మృతుడికి భార్య వసంత, ఇద్దరు కుమారులు ఉన్నారు.

అప్పు చెల్లించమన్నాడని హత్యాయత్నం

ఫైటింక్లయిన్‌కాలనీ, జూలై 13: తీసుకున్న అప్పు చెల్లించమన్నందుకు గొడవ తలెత్తింది. ఆ గొడవ కత్తి పోట్లకు దారితీసింది. గోదావరిఖని టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని సుందిల్లకు చెందిన చొప్పరి లక్ష్మణ్ అదే గ్రామానికి చెందిన దండె రాహుల్‌రాజ్‌పై శనివారం కత్తితో దాడి చేశాడు. సుందిల్ల గ్రామానికి చెందిన చొప్పరి లక్ష్మణ్ ఇంటికి సమీపంలో ఉండే రాహుల్ రాజ్‌ను అవసరాల నిమిత్తం లక్ష రూపాయలు అప్పుగా అడగగా, అతను ఓ వ్యక్తి వద్ద ఇప్పించాడు.

ఆరు నెలల్లో తిరిగి ఇస్తానని చెప్పాడు. గడువు ముగియడంతో తీసుకున్న అప్పు తిరిగి ఇవ్వాలని రాహుల్ పలుమార్లు లక్ష్మణ్‌ను అడిగాడు. శుక్రవారం లక్ష్మణ్ ఇంటికి వెళ్లి డబ్బులు అడగగా ఇవ్వనని తిట్టాడు. రాత్రి రాహుల్ ఇంటికి వెళ్లిన లక్ష్మణ్ అతడిపై గొడ్డలితో దాడికి ప్రయత్నించగా స్వల్ప గాయాలయ్యాయి. దాడి తర్వాత లక్ష్మణ్ పారిపోయాడు. శనివారం ఉదయం మరోసారి రాహుల్‌రాజ్ ఇంటికి వెళ్లిన లక్ష్మణ్ కత్తితో దాడి చేశాడు. దీంతో రాహుల్‌కు కాలిపై, మొహంపై గాయాలయ్యాయి. రాహుల్ కుటుంబసభ్యులు లక్ష్మణ్‌పై కారంపొడి చల్లడంతో అక్కడ నుంచి పారిపోయాడు. రాహుల్‌రాజ్ భార్య ప్రేమలత ఇచ్చిన ఫిర్యాదు మేరకు లక్ష్మణ్‌పై హత్యాయత్నం కేసు నమోదు చేసినట్లు ఎస్సై వెంకటేష్ తెలిపారు.

చెరువు కట్ట, రహదారి కబ్జా చేశారని రైతుల ఆందోళన


మంథనిలో ధర్నా చేస్తున్న రైతులు

మంథని, జూలై 13: రైతులు తమ వ్యవసాయ పనుల కోసం పొలాల వద్దకు వెళ్లేందుకు వినియోగిస్తున్న చెరువుకట్ట, రహదారిని కొంత మంది కబ్జా చేశారని రైతులు మంథనిలోని అబేడ్కర్‌చౌక్‌లో శనివారం ఆందోళనకు దిగారు. రైతుల కథనం ప్రకారం.. బిట్టుపల్లి గ్రామ శివారులోని సర్వే నంబర్ 116లోని 217 ఎకరాల విస్తీర్ణంలో చెరువ ఉంది. చెరువులోని నీటి ద్వారా మండలంలోని కాకర్లపల్లి, సూరయ్యపల్లి, ధర్మారం, సీతంపల్లి, బిట్టుపల్లి, ఎక్లాసూపూర్, నెల్లిపల్లి గ్రామాల్లోని వేలాది ఎకరాలు సాగవుతున్నాయి. చెరువు మీద నుంచి పొలాల వద్ద వెళ్లేందుకు కొన్నేళ్లుగా రైతులు చెరువు కట్టను అనుకొని ఉన్న రహదారిని వినియోగిస్తున్నారు. చెరువు కట్టను అనుకొని ఉన్న రహదారిని ముత్తినేని స్వామి, మాధవరావు కిష్టయ్య, పోగుల శంకరయ్య, ఆకుతోట రాజయ్య అనే రైతులు తమ వ్యవసాయ భూమిలో కలుపుకున్నారు. ఈ విషయాన్ని తెలుసుకున్న బిట్టుపల్లి గ్రామ రైతులు భూమి కబ్జాను అడ్డుకునే ప్రయత్నాలు మొదులు పెట్టారు. ఇందులో భాగంగా గత సోమవారం పెద్దపల్లి జిల్లా కలెక్టరేట్‌లో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్‌ను కలిసి కబ్జా విషయాన్ని వివరించి అడ్డుకోవాలని దరఖాస్తు చేసుకున్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు రెవెన్యూ అధికారులు కబ్జా స్థలం వద్దకు వెళ్లి పంచనామా నిర్వహించి పనులు నిలిపివేయాలని ఆదేశించారు. కబ్జాదారులు దీన్ని పట్టించుకోకుండా చెరువుకట్ట, రహదారి భూమిని తమ వ్యవసాయ భూమిలో కలుపుకున్నారు. దీంతో గ్రామానికి చెందిన రైతులంతా ఏకమై శనివారం ఎక్స్‌కవేటర్ సాయంతో చెరువుకట్ట రహదారి పునర్నిర్మాణ పనులు ప్రారంభించారు. విషయం తెలుసుకున్న కబ్జాదారులు పనులను అడ్డుకున్నారు. దీంతో ఇరువర్గాల మధ్య ఘర్షణ వాతావరణం చోటుచేసుకుంది. విషయాన్ని తెలుసుకున్న మంథని పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని ఇరువర్గాలను శాంతింపజేసి అక్కడి నుంచి పంపించారు. దీంతో రైతులంతా మంథనికి చేరుకొని స్థానిక అంబేద్కర్ చౌరస్తాలో ధర్నా నిర్వహించారు. తమ చెరువు కట్ట, రహదారిని కబ్జా చేసిన వారిని వెంటనే శిక్షించాలని.. తమ రహదారిని పునరుద్ధరించాలని.. వెంటనే తమకు న్యాయం చేయాలంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. రైతులు ధర్నా చేస్తున్న విషయాన్ని తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని విరమింపే ప్రయత్నం చేసినప్పటికీ వారు వినలేదు. ధర్నా చేసే రైతులతో మంథని తహసీల్దార్ రాజయ్య ఫోన్లో మాట్లాడి సోమవారం వరకు రైతులకు న్యాయం జరిగేలా చూస్తానని హామీ ఇవ్వడంతో రైతులు తమ ధర్నాను విరమించారు.

వ్యవసాయ సాగుపై అవగాహన



వరి నారును పరిశీలిస్తున్న విద్యార్థులు

సుల్తానాబాద్, జూలై 13: రైతులు ప్రతీ సీజన్‌లో చేపట్టే వ్యవసాయ సాగు పద్ధతి గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. సుల్తానాబాద్ పట్టణంలోని సెయింట్ మేరీస్ స్కూల్‌కు చెందిన విద్యార్థులు కరస్పాండెంట్ హెచ్‌ఎం ఫాదర్ కాసు శౌరెడ్డి ఆధ్వర్యంలో మండలంలోని ఐతరాజుపల్లి గ్రామంలో శనివారం పర్యటించారు. క్షేత్ర స్థాయిలో వీరు రైతులు సాగుచేసే పద్ధతులను తిలకించారు. వారితో పాటు పిల్లలు నాట్లు కూడా వేశారు. రైతులు వ్యవసాయ పద్ధతుల గురించి పిల్లలకు వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రజిత, జవేరియా తదితరులు పాల్గొన్నారు.

హాస్టల్ సరుకుల టెండర్లలో జాప్యం

- 15 రోజులు కావస్తున్నా ఖరారు కాని టెండర్లు - ఆందోళన చెందుతున్న కాంట్రాక్టర్లు

పెద్దపల్లి, జూలై 13 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహాలు, మైనార్టీ గురుకుల విద్యార్థులకు మెనూ అమలు చేసేందుకు కావాల్సిన సరుకుల కోసం టెండర్లు ఖరారు చేయకపోవడంతో విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందడం లేదు. పదిహేను రోజుల క్రితమే ఖరారు చేయాల్సిన టెండర్లను సంబంధిత అధికారి ఖరారు చేయకపోవడంతో కాంట్రాక్టర్లు ఆందోళన చెందుతున్నారు. జిల్లాలో గల ఎస్సీ, ఎస్టీ, బీసీ వసతి గృహాలతో పాటు గురుకుల విద్యాలయాలు, ఇతర విద్యా సంస్థల్లో విద్యాభ్యాసం చేసే విద్యార్థులకు వసతి గృహాల్లో మెనూ ప్రకారం భోజనాలు, టిఫిన్లు, స్నాక్స్ అందించేందుకు ప్రతి ఏటా జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఆధ్వర్యంలో టెండర్లు ఆహ్వానిస్తారు. ఈ టెండర్లను ప్రతి ఏటా మే నెలలోనే ఖరారు చేస్తారు. ఈసారి పార్లమెంట్ ఎన్నికల కోడ్ జూన్ 6వ తేదీ వరకు అమల్లో ఉన్న కారణంగా ఆలస్యం అయ్యింది. అదనపు కలెక్టర్ సెలవులో ఉన్న కారణంగా జిల్లాలో గల సాంఘిక సంక్షేమ వసతి గృహాలు, నంది మేడారంలో గల టీఎస్‌ఆర్‌జేసీ, మైనార్టీ గురుకుల విద్యాలయాలకు కిరాణా సామాన్లు, చికెన్, మటన్, కోడిగుడ్లు, పండ్లు, క్యాటరింగ్, కూరగాయల కోసం టెండర్లను నిర్వహించే బాధ్యతను స్థానిక సంస్థల అదనపు కలెక్టర్‌కు జిల్లా కలెక్టర్ అప్పగించారు. ఆ మేరకు టెండర్లను ఆహ్వానించారు. వచ్చిన టెండర్లను గత నెల 25వ తేదీన సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహాల టెండర్లు, 26న మైనార్టీ గురుకుల విద్యాలయాల టెండర్లను ఖరారు చేయాల్సి ఉంది. ఇతర విద్యా సంస్థలకు సంబంధించిన టెండర్లు పూర్తి కాగా, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్‌కు అప్పగించిన టెండర్లను ఖరారు చేయలేదు. దీంతో ఆయా విద్యాలయాలకు సరుకులను సరఫరా చేసేందుకు పాత కాంట్రాక్టర్లు ఉత్సాహం చూపడం లేదు. టెండర్లు ఆలస్యం కావడంతో తమకు దక్కుతాయా, లేదా అనే అనుమానాలతోనే ఉన్నారు. సకాలంలో సరుకులు సరఫరా కాకపోవడంతో వార్డెన్లు ఇబ్బందులు పడుతున్నారు.

అతి తక్కువ మంది విద్యార్థులు గల వసతి గృహాలకు సరుకులు సరఫరా చేయలేమని పాత కాంట్రాక్టర్లు చెబుతున్నారు. దీంతో కొన్ని చోట్ల వార్డెన్లు సరుకులను తీసుక వస్తున్నారు. తక్కువ మంది విద్యార్థులు ఉన్న వసతి గృహాలకు సరుకులను సరఫరా చేసేందుకు కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదు. వచ్చిన టెండర్లను ఖరారు చేయడంలో జాప్యం చేస్తున్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో స్కిన్‌లెస్ చికెన్ ధర 240 రూపాయలు ఉండగా, 160 రూపాయలకు సరఫరా చేయాలని, కూరగాయల ధరలు కిలోకు 40 నుంచి 100 రూపాయల వరకు ఉండగా, 20 రూపాయల వరకు సరఫరా చేయాలని, కోడిగుడ్లను ఐదు రూపాయలకు ఒకటి చొప్పున సరఫరా చేయాలని సంబంధిత అధికారి అంటున్నారని కాంట్రాక్టర్లు వాపోయారు. అది ఎలా సాధ్యమని అడిగితే మాట్లాడనీయడం లేదని, మైనారిటీ హాస్టళ్లు మంథని, సుల్తానాబాద్, పెద్దపల్లి, రామగుండంలలో ఉన్నాయని, సరుకులను తామే తీసక పోయి వేసి రావాలన్నారు. ఇందుకు రవాణా ఖర్చులు, తమ కూలీ కూడా రావడం లేదని, ఒక్కోసారి ధరలు పెరిగినప్పుడు ఏమి మిగలడం లేదని నష్టపోవాల్సి వస్తున్నదని కాంట్రాక్టర్లు వాపోయారు. ఈ విషయమై జిల్లా కలెక్టర్ చొరవ తీసుకొని ఈ సమస్యకు పరిష్కారం చేయాలని పిల్లల తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్‌కు శుభాకాంక్షలు తెలిపిన నేతలు



ప్రీతంను కలిసిన ఎస్సీ సెల్ నేతలు

సుల్తానాబాద్, జూలై 13: తెలంగాణ రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన నాగరిగారి ప్రీతంను పెద్దపల్లి జిల్లా ఎస్సీ సెల్ మాజీ అధ్యక్షుడు, సుల్తానాబాద్ మండలం కాట్నపల్లి కి చెందిన కలువల శ్రీనివాస్ తదితరులు కలసి శుభాకాంక్షలు తెలిపారు. శనివారం హైదరాబాద్‌లో ప్రీతంను కలసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. గత ప్రభుత్వంలో మంజూరైన కార్పొరేషన్ రుణాలు, ఎస్సీ సంక్షేమం గురించి చర్చించారు.

అయ్యప్ప స్వామి ఆలయానికి గేట్లు వితరణ

సుల్తానాబాద్, జూలై 13: సుల్తానాబాద్ పట్టణంలోని అయ్యప్ప స్వామి ఆలయానికి నూతన గేట్లను నిర్మించి అందించారు దాతలు. సుల్తానాబాద్ పట్టణానికి చెందిన అల్లం సత్యనారాయణ, బాగ్యలక్ష్మి దంపతులు ఇద్దరు రిటైర్డ్ ప్రభుత్వ ప్రధానోపాధ్యాయులు. వీరు అనేక సామాజిక సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. దానధర్మాలు చేస్తూ పేదలను ఆదుకుంటున్నారు. అలాగే నీరుకుళ్ల రోడ్డులో నిర్మించిన అయ్యప్ప అలయానికి లక్షలాది రూపాయలు కూడా విరాళంగా ఇచ్చారు. శనివారం కొత్తగా ఆలయానికి 70 వేల రూపాయలతో గేట్లు చేయించి వాటిని ఆలయానికి అప్పగించారు.

వ్యవసాయ భూములకు వెళ్లే దారిని పరిరక్షించాలి

- కలెక్టర్ కార్యాలయంలో గ్రామస్థుల వినతి



వినతిపత్రం అందిస్తున్న బ్రాహ్మణపల్లి గ్రామస్థులు

పెద్దపల్లి రూరల్, జూలై 13: వ్యవసాయ భూములకు వెళ్లేందుకు పురాతన కాలం నుంచి ఉన్న దారిని పరిరక్షించాలని పెద్దపల్లి మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామస్థులు శనివారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం అందించారు. అనంతరం పెద్దపల్లి తహసీల్దార్ రాజ్‌కుమార్‌ను కలిసి సమస్యను వివరించారు. సర్వే ప్రకారం దారి తనకే చెందుతుందని గ్రామానికి చెందిన పిడుగు లింగయ్య దున్ని నాటు వేశాడని అధికారులకు గ్రామస్థులు మొరపెట్టుకున్నారు. దారి దున్నడంతో ప్రస్తుతం వ్యవసాయ పనులకు సొంత పొలాలకు వెళ్లడానికి ఇబ్బందులు పడుతున్నామని అధికారులు విచారణ జరిపి న్యాయం చేయాలని రైతులు కోరారు. వినతిపత్రం అందించిన వారిలో మాజీ సర్పంచ్ గాండ్ల మల్లేషం, బొల్లం తిరుపతి, దామెరకొండ మల్లయ్య, తోట కాంతయ్య, ఓదెల రాజు, మ్యాకల రాజయ్య, గురిజాల లక్ష్మయ్య, తిరుమలేష్, గాండ్ల సదయ్య, నరేందర్, గురిజాల రాజు, వెంకటేషం, వెంకన్న, జంగిలి రాజేశం, మహేందర్, నర్సింగం, రవి తదితరులు పాల్గొన్నారు.

'ఖని' నుంచి అరుణాచల క్షేత్రానికి ప్రత్యేక బస్సు

కళ్యాణ్‌నగర్, జూలై 13: ఈనెల 21న గురుపౌర్ణమి సందర్భంగా గోదావరిఖని ఆర్టీసీ డిపో నుంచి తమిళనాడు రాష్ట్రంలోని అరుణచలం పుణ్యక్షేత్రానికి ప్రత్యేక బస్సును నడపనున్నట్టు గోదావరిఖని ఆర్‌టీసీ డిపో మేనేజర్ నాగభూషణం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 19న సాయంత్రం నాలుగు గంటలకు సూపర్ లగ్జరీ బస్సు గోదావరిఖని ఆర్‌టీసీ బస్సు బయలు దేరుతుందని, మరుసటి రోజు అరుణచలం క్షేత్రానికి కాణిపాకం, వెల్లూరు ద్వారా చేరుకుంటుందన్నారు. అప్ అండ్ చార్జీ 4,800 రూపాయలు నిర్ణయించినట్టు, పూర్తి వివరాలకు సెల్ నంబర్ 7382847316, 7382847427లలో సంప్రదించాలని డిపో మేనేజర్ కోరారు.

పరిసరాల పరిశుభ్రత పాటిస్తే రోగాలు దరిచేరవు: ఆర్డీవో



గ్రామస్థులు, అధికారులతో మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి



సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

పెద్దపల్లి రూరల్, జూలై 13: సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న దృష్ట్యా పరిసరాలను శుభ్రంగా ఉంచడంతో పాటు శుభ్రత పాటిస్తే రోగాలు దరిచేరకుండా ఉంటాయని మండల ప్రత్యేకాధికారి, ఆర్డీవో గంగయ్య అన్నారు. శనివారం మండలంలోని పెద్దకల్వల, నిమ్మనపల్లి, నిట్టూరు గ్రామాల్లో పంచాయతీ అధికారులతో కలిసి ఆర్డీవో పర్యటించారు. ఈ సందర్భంగా ఇంటింటా తిరుగుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, నీరు నిల్వలేకుండా జాగ్రత్త పడాలని సూచించారు. సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని చిన్నపాటి జ్వరం వచ్చినా ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యులను సంప్రదించాలని సూచించారు. ఆర్డీవో వెంట ఎంపీవో సుదర్శన్, పంచాయతీ కార్యదర్శులు రణధీర్, మహేష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ముత్తారం: మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో సీజనల్ వ్యాధులు రాకుండా నివారణ చర్యలు చేపట్టాలని మండల ప్రత్యేక అధికారి రవీందర్ అన్నారు. శనివారం ఎంపీడీవో లలిత, డాక్టర్ అమరేందర్‌రావుతో కలిసి, మండలంలోని ఇప్పలపల్లి. సీతంపేట, ఖమ్మంపల్లి, అడవిశ్రీరాంపూర్, ముత్తారం, మైదంబండ గ్రామాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ముఖ్యంగా సీజనల్ వ్యాధులైన డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ వంటి జ్వరాలు రాకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. మురికి కాలువలను శుభ్రపరచాలని, బ్లీచింగ్ పౌడర్ చల్లాలని సూచించారు. తాగునీటికీ క్లోరినేషన్ చేయాలని సిబ్బందిని ఆదేశించారు. ఇంటి చుట్టు పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత ఇంటి యజమానులదే అని అన్నారు. దీనిపై పంచాయతీ సెక్రెటరీలు అవగాహన కల్పించాలన్నారు. ఇంటి చుట్టూ ఉన్న ప్లాస్టిక్ డబ్బాలు, కొబ్బరి బోండాలు, పాత టైర్లు వంటివి ఉంటే వాటిలో వర్షపునీరు చేరి, దోమలకు నిలయంగా మారుతుందన్నారు. ఎంపీడీవో లలిత, ఎంపీవో వేణుమాధవ్, ప్రభుత్వ వైద్యాధికారి డాక్టర్ అమరేందర్‌రావు, పంచాయితీ కార్యదర్శులు, అంగన్వాడి కార్యకర్తలు, అశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎలిగేడు: ప్రస్తుత వర్షాకాలం సీజన్‌లో వచ్చే వ్యాధులు దరిచేరకుండా ప్రతీ ఒక్కరు జాగ్రత్త పడాలని గ్రామ స్పెషల్ ఆఫీసర్ ఏవో ఉమాపతి తెలిపారు. శనివారం మండలంలోని ర్యాకల్‌దేవ్‌పల్లిలో ఇంటింటా తిరుగుతూ పరిసరాల పరిశుభ్రత గూరించి అవగాహన కల్పించారు. ఇంటి ఆవరణలో నీటి నిలువ ఉండకుండా చూసుకోవాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం ముందస్తుగా పలు సూచనలు చేస్తూ అధికారులను అప్రమత్తం చేస్తోందన్నారు. ప్రతీ ఒక్కరు ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటే ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. ఆయనతో పాటు హెల్త్ సిబ్బంది, అంగన్వాడీ వీవోఏ, గ్రామపంచాయతీ కార్యదర్శి, మాజీ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

● పరిశుభ్రత పై ప్రజలకు అవగాహన

మంథని: మున్సిపల్ పరిధలోని 11వ అంగన్‌వాడి కేంద్రం పరిధిలో సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, దోమల బెడద లేకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని శనివారం అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ కరుణశ్రీ, ఏఎన్‌ఎం స్వప్న, అశ కార్యకర్తలు రూప, కమల, స్రవంతిలు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరా నిలిపివేశారని మహిళల ధర్నా

మంథని, జూలై 13: తమ ఇళ్లకు విద్యుత్ సరఫరా నిలిపివేశారంటూ మండలంలోని కాకర్లపల్లి గ్రామానికి చెందిన దళిత మహిళలు స్థానిక అంబేద్కర్ చౌక్‌లో శనివారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు మాట్లాడుతూ.. గ్రామంలోని ఎస్సీ కాలనీలో నివాసముంటున్న తమ ఇళ్లలో విద్యుత్ సరఫరాను విద్యుత్ అధికారులు దౌర్జన్యంగా నిలిపి వేశారని ఆరోపించారు. నిరుపేద ఎస్సీలమైన తమకు కరెంట్ మీటర్లు లేవని, తీగల ద్వారా విద్యుత్‌ను తీసుకుంటున్నామన్నారు. ఈ నేపథ్యంలో తమ కాలనీలోకి వచ్చిన విద్యుత్ శాఖ అధికారులు దౌర్జన్యంగా వ్యవహరిస్తూ కరెంట్ తీగలను ఇష్టం వచ్చినట్లు కట్ చేశారని ఆరోపించారు. తమ కాలనీలోకి వచ్చి దౌర్జన్యంగా కరెంట్ తీగలను కట్ చేయడంతో దురుసుగా ప్రవర్తించిన తీరును ఖండిస్తూ తాము ధర్నా చేస్తున్నామన్నారు. తమతో దురుసుగా ప్రవర్తించిన విద్యుత్ శాఖ అధికారులు వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

దీనిపై విద్యుత్ శాఖ ఏఈ రాజమల్లయ్యను వివరణ కోరగా.. కాకర్లపల్లి గ్రామంలోని ఎస్సీ కాలనీలో నివాసముండే వారు ఎన్ని సార్లు చెప్పిన విద్యుత్ మీటర్లు పెట్టుకోవడం లేదన్నారు. నాలుగు సంవత్సరాల క్రితం కూడా వారిని విద్యుత్ మీటర్లు పెట్టుకోవాలని సూచించామని అయినా వారు పట్టించుకోవడం లేదన్నారు. దీంతో తమ సిబ్బంది అక్రమంగా విద్యుత్ వాడుకుంటున్న వారి తీగలను తొలగించారన్నారు. తమ సిబ్బంది ఎవరితో కూడా దురుసుగా ప్రవర్తించలేదని తెలిపారు.

యాదవ మహాసభ యువజన అధ్యక్షుడిగా వర్షిత్

ఓదెల, జూలై 13: మండల కేంద్రంలో శనివారం యాదవ మహాసభ యువజన విభాగం సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకు న్నారు. యాదవ మహాసభ యువజన అధ్యక్షుడిగా బండారి వర్షిత్ యాదవ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

అలాగే ఉపాధ్యక్షుడిగా జంగ అజయ్‌కుమార్ యాదవ్ ఎన్నిక య్యారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి వేల్పుల కుమార్ యాదవ్, జిల్లా అధ్యక్షుడు అట్ల సాగర్ యాదవ్, కొమ్మ సతీష్, వినీత్, సాయి, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గోరింటాకు మహోత్సవం



గోరింటాకు పెట్టుకున్న విద్యార్థులు



గోరింటాకు పెట్టుకున్న కార్పొరేటర్, మహిళలు

సుల్తానాబాద్, జూలై 13: ఆషాఢ మాసం సందర్భంగా సుల్తానాబాద్ పట్టణంలో మహిళలు గోరింటాకు పండుగను నిర్వహించుకున్నారు. వాసవి అమ్మ వారి ఆలయంలో మహిళలంతా చేరి అమ్మ వారికి గోరింటాకు పండుగ చేశారు. ఇంటి నుంచి తెంపుకుని వచ్చిన మైదాకులను ఆలయంలో సామూహికంగా నూరి వాసవి అమ్మ వారికి పెట్టి ఎన్నో ఎళ్ల నుంచి వస్తున్న ఆచారాన్ని సంప్రదాయాన్ని కొనసాగించి మొక్కులు చెల్లించుకుంటున్నారు. అమ్మ వారికి పెట్టిన అనంతరం మహిళలు ముత్తయిదువలు ఒకరికిఒకరు గోరిరంటాకును పెట్టుకుని పండుగ జరుపుకున్నారు. మహిళలు తమ చేతులకు అందంగా అద్దుకుని మురిసిపోయారు.

కోల్‌సిటీటౌన్: గోదావరిఖని జవహర్‌నగర్‌లోని సరస్వతి విద్యామందిర్‌లో శనివారం ఆషాఢ మాస గోరింటాకు వేడుక నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పాఠశాల ప్రబంధనకారణి సోమారపు లావణ్య పాల్గొని ఉపాధ్యాయులు, చిన్నారులతో కలిసి గోరింటాకు పెట్టుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడు తూ రాబోయే తరానికి సంస్కృతి సంప్రదాయాలు, విలువలు తెలియజేయాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందన్నారు. ఆషాడ మాసంలో ఉన్న టువంటి గోరింటాకు విశిష్టతను ఆమె తెలియజేశారు. ఈ కార్యక్రమంలో విద్యామందిర్ కార్యదర్శి రవీందర్, శ్రీనివాస్, పద్మ, సుమాంజలి, జ్యోతి పాల్గొన్నారు.

కళ్యాణ్‌నగర్: ఆషాఢ మాసం సందర్భంగా 25వ డివిజన్ ఆర్‌టీసీ కాలనీలో కార్పొరేటర్ నగునూరి సుమలత ఆధ్వర్యంలో గోరింటాకు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆషాడం మాసంలో గోరింటాకు ప్రత్యేకతను మహిళలకు వివరించారు. ప్రతి పండుగను అందరూ ఐకమత్యం నిర్వహించుకోవాలని కోరారు.



సుల్తానాబాద్‌లో గోరింటాకు పెట్టుకుంటున్న మహిళలు

వీఆర్‌ఏల సమస్యల పరిష్కరించేలా చర్యలు: ఎమ్మెల్సీ

జగిత్యాల టౌన్, జూలై 13: వీఆర్‌ఏల సమస్యల పరిష్కరించేలా కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు చేపట్టిందని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి పేర్కొన్నారు. జగిత్యాల జి ల్లాలో పనిచేస్తున్న వీఆర్‌ఏలు తమ సమస్యలను పరిష్కరించి తమకు, తమ వారసులకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు. అనంతరం జీవన్ రెడ్డి వీఆర్‌ఏల సమస్యలపై సీఎం రేవంత్‌రెడ్డికి ప్రత్యేక లే ఖను రాసి మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో 61 ఏళ్ల పైబడిన 37,97 మంది వీఆర్‌ఏల స్థానంలో దశాబ్ధకాంటా విధులు వారి వారసులు నిర్వహిస్తున్నార ని వారి అర్హతకు అనుగుణంగా ఉద్యోగ అవకాశాలు కల్పించేలా సీఎంకు లేఖ లో వివరించినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వీఆర్‌ఏ సంఘం నాయకు లు ఉన్నారు.

వీధి కుక్కల దాడిలో గేదె మృతి

పెగడపల్లి, జులై 13 : మండల కేంద్రంలో శనివారం వీధి కుక్కల దాడిలో గేదె మృతి చెందింది. మండల కేం ద్రానికే చెందిన నేదరి పోచయ్యకు చెందిన చిన్న గేదెను వీధి కుక్కలు వెంట పడి మూకుమ్మడిగా దాడి చేయడంతో మృతి చెందింది.

ప్రభుత్వం కుక్కల బెడదను నివారిం చాలని, మృతి చెందిన గేదెకు ప్రభుత్వ పరంగా తనకు ఆర్థిక సాయం అందించి ఆదుకోవాలని బాధిత రైతు కోరారు.

మోటార్ వర్కర్ యూనియన్ మహాసభను విజయవంతం చేయండి



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న యూనియన్ నాయకులు

కళ్యాణ్‌నగర్, జూలై 13: ఎన్‌టీపీసీ జ్యోతినగర్‌లో ఆదివారం నిర్వహించే పెద్దపల్లి జిల్లా మోటార్ వర్కర్స్ యూనియన్ మూడో మహాసభలను విజయవంతం చేయాలని ఆ యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎడ్ల రవికుమార్ పిలుపునిచ్చారు. శనివారం గోదావరిఖని గంగానగర్‌లోని లారీ యార్డు వద్ద జరిగిన పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కేంద్రంలో, రాష్ట్రంలో సుమారు 25లక్షల మంది మోటారు రంగంలో పని చేస్తున్నారని, వీరికి ఎలాంటి భద్రత లేదన్నారు. మోదీ ప్రభుత్వం మోటార్ రంగం కార్మికుల పట్ల కఠినంగా వ్యవహరిస్తుందని, అందులో భాగంగానే పెనాల్టీలు, అక్రమంగా వసూళ్లకు పాల్పడుతున్నారని, దీంతోడ్రైవర్ల పరిస్థితి అగమ్యగోచరంగా మారిందన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇటీవల తీసుకువచ్చిన హిట్ అండ్ రన్ చట్టాన్ని రద్దు చేయాలని, ఈ చట్టం వల్ల డ్రైవర్లకు తీవ్రంగా నష్టం జరిగే పరిస్థితి ఉందన్నారు. ఆదివారం జరిగే మహాసభలకు పెద్ద ఎత్తున మోటార్ వర్కర్స్ తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు మహిపాల్, సతీష్, దామోదర్, మల్లేష్, వెంకటేష్, గురుదత్తా, రఘురాజయ్య పాల్గొన్నారు.

జ్వరాలతో బాధపడుతున్న వారికి పరామర్శ



బాధితులను పరామర్శిస్తున్న నల్ల మనోహర్‌రెడ్డి

సుల్తానాబాద్, జూలై 13: సుల్తానాబాద్ ప్రభుత్వ అసుపత్రిలో జ్వరాలతో బాధపడుతన్న పలువురిని బీఆర్‌ఎస్ నాయకుడు నల్ల మనోహర్‌రెడ్డి శనివారం పరామర్శించారు. మండలంలోని రేగడి మద్దికుంట, అల్లీపూర్ గ్రామాలకు చెందిన వారు ప్రభుత్వ అసుపత్రిలో చేరి చికిత్స పొందుతున్నారని వీరికి మెరుగైన చికిత్స అందించి వారి బాగోగులు చూడాలని వైద్య ఆరోగ్య శాఖ అధికారులతో మాట్లాడారు. అల్లీపూర్‌లో పారిశుధ్య పనులు నిర్వహించాలని అలాగే ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేసి గ్రామంలో జ్వరాలను అదుపు చేయాలని సూచించారు. లేని పక్షాన రెండు రోజుల్లో తానే ప్రైవేట్ అస్పత్రుల వారి సహకారంతో మెడికల్ క్యాంపు నిర్వహిస్తామని మనోహర్‌రెడ్డి తెలిపారు.



ఓసీపీ-3లో వనమహోత్సవం మొక్కలు నాటిన జీఎం

యైటింక్లయిన్‌కాలనీ, జూలై 13: ఓసీపీ-3 బేస్‌వర్క్‌షాప్‌లో వనమహోత్సవంలో భాగంగా శనివారం ఆర్జీ-2 జీఎం సూర్యనారాయణ మొక్కలు నాటారు. ఈసందర్భ ంగా జీఎం మాట్లాడారు. వనమహోత్సవ కార్యక్రమాన్ని ఏరియా పరిధిలో విజయవంతం చేసేలా 3333 మొక్కలు నాటాలని నిర్ణయం తీసుకున్నట్టు జీఎం తెలిపారు. ఈ ఏడాది ఆర్జీ-2 పరిధిలోని 43 హెక్టార్‌లలో 1,03,033 మొక్కలు నాటేలా ప్రణాళికలు సిద్ధ చేసినట్టు జీఎం పేర్కొన్నారు. ఉద్యోగులు, పరిసర గ్రామాల ప్రజలకు 15వేల మొక్కలను పంపిణీ చేయనున్నామని తెలిపారు.

పరిసర ప్రాంత గ్రామాల ప్రజలకు పర్యావరణ పరిరక్షణ, మొక్కలను పెంచడంపై అవగాహన పెంచేలా కార్యక్రమాన్ని నిర్వహించనున్నామని అన్నారు. ప్రతిఒక్కరు మొక్కలు నాటే కార్యక్రమంలో భాగస్వాములు కావాలని జీఎం కోరారు. పర్యావరణ పరిరక్షణకు సింగరేణి అనేక రకాల పర్యావరణహిత కార్యక్రమాలు చేపట్టి, ఉద్యోగు లతో మొక్కలు నాటించి వాటిని సంరక్షించడం జరుగుతున్నట్టు జీఎం పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు అధికారి మధుసూదన్, పీఈ రాజాజీ, అధికారులు రాజేంద్రప్రసాద్, మురళీకృష్ణ, సురేష్‌బాబు, బూక్యదేశాయి, రామకృష్ణ, జనార్ధన్, పిట్ సెక్రెటరీ ఎజ్జ రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో కిక్కిరిస్తున్న జనం

- రోజురోజుకు పుంజుకుంటున్న రిజిస్ట్రేషన్ల సంఖ్య -ఆగస్టు 1 నుంచి చార్జీల మోతే కారణం

పెద్దపల్లిటౌన్, జూలై 13: త్వరలో రిజిస్ట్రేషన్ చార్జీలు పెరగనున్నండడంతో జిల్లా కేంద్రంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రద్దీ నెలకొన్నది. ఆగస్టు నెల రాకముందే తమ భూములు, ప్లాట్లు రిజిస్ట్రేషన్ చేయించుకునేందుకు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల వద్ద బార్లు తీరుతున్నారు. ప్రభుత్వం ఏ స్థాయిలో చార్జీలు పెంచుతుందోనన్న ఉద్దేశ్యంతో భూములు కొనుగోలు చేసిన వారు రిజిస్ట్రేషన్లు చేయించుకునేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

పది రోజల క్రితం వరకు పెద్దపల్లిలో ఐదారు రిజిస్ట్రేషన్లు జరిగేవి. ఇప్పుడు రోజుకు 30 వరకు జరుగుతున్నాయి. ఆగస్టు ఒక్కటి నుంచి రిజిస్ట్రేషన్ ధరలు పెంచుతామంటూ ప్రభుత్వం ప్రకటించింది. ఈనెల 18న కలెక్టర్లు, ఆర్డీవోలతో స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ సమావేశమై చార్జీల పెంపుపై తుది నిర్ణయం తీసుకునే అవకాశాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో భూములు, ప్లాట్లు కొనుగోలు చేసినవారు ముందు జాగ్రత్తలు తీసుకుంటు న్నారు. భూములు, ప్లాట్లపై ఉన్న వివాదాలను సెటిల్ చేసుకొని రిజిస్ట్రేషన్‌కు సిద్ధమవుతున్నారు. అంతేకాకుండా ఆగస్టు, సెప్టెంబరు, అక్టోబరు నెలల్లో వాయిదాలు చెల్లించి రిజిస్ట్రేషన్ చేసుకోవా ల్సి ఉండగా ముందస్తుగానే వాయిదాల సొమ్ము చెల్లించి రిజిస్ట్రేషన్ చేయించుకుంటున్నారు. దీంతో కార్యాలయాలు జనంతో కిక్కిరిసిపోతున్నాయి.



రిజిస్ట్రేషన్ కార్యాలయం వద్ద జనం

ఆగస్టు 1 నుంచి కొత్త చార్జీలు

- ఎస్ కిరణ్‌కుమార్, సబ్‌రిజిస్ట్రార్

వచ్చే ఆగస్టు 1 నుంచి కొత్త రిజిస్ట్రేషన్ చార్జీలు అమలు కానున్నాయి. గత నెలకు ఈనెలకు రిజిస్ట్రేషన్ల సంఖ్య పెరిగింది. కార్యాలయ సిబ్బంది కొరత ఉన్నప్పటికి స్లాట్లు బుక్ చేసుకున్న వారి రిజిస్ట్రేషన్లు చేస్తున్నాం. రానున్న రోజుల్లో మరిన్ని రిజిస్ట్రేషన్లు పెరుగనున్నాయి.